


బొంబాయి ఆంధ్రమహాసభ నిర్వహించిన కథల పోటీలో




మొదటి బహుమతి పొందిన కథ

“ప్రాకారములోని తెగలు పన్మాన్యక్రియల
బాపుకోలేరు పాప సమాప్తి కాదు.”

రకరకాల మనుష్యుల్తో, వింత మనస్తత్వాలతో కూడుకున్న ఈ ప్రపంచాన్ని చూసీ చూడగానే నమ్మేస్తే మోస పోవడమే మిగుల్తుంది. ఏ పుట్టలో ఏ పాముందో తెలుసుకోవడం సులభమే గాని, ఏ మనిషిలో ఏం మనసుందో తెలుసుకోవడం చాలా కష్టతరం.

ఒకరోజు శ్రీ పత్రికలో పడ్డ విచిత్రవార్త:

“కనకేశ్వరపురానికి చెందిన అమ్మాయిలు ఇద్దరు ఒక సంవత్సరం తేడాతో మాయమయ్యారు. వాళ్ళు ఏమైపోయిందీ ఎవరికీ తెలియదు. పోలీసు శాఖ ఈ విషయంలో తీవ్రంగా దర్యాప్తు చేస్తోంది.”

ఈ వార్త ప్రజల్లో సంచలనాన్ని లేవదీసింది. ఆడపిల్లలు గల తల్లిదండ్రులు ఎంతో భయపడి పోయారు.

* * *

అదో మారుమూల గ్రామం. పేరు కనకేశ్వరపురం. ఆ గ్రామంలో వున్న ఇళ్ళన్నీ లెక్కకట్టి చెప్పొచ్చు. అందులో చెప్పుకోదగినవి మూడే మూడిళ్ళు.

మొదటిది రాజుగారి పాత డాబా, రెండోది రావు బహద్దూర్ కనకేశ్వరరావుగారి బంగళా. ఈయన పేరుతోనే గ్రామం పేరుకూడా ప్రకాశిస్తోంది. ఇక మూడోది అంబరం మందునా పెంకుటిల్లు. తక్కినవన్నీ సామాన్యమైనవే.

రాజుగారు—

రాజుగారు బతికి చెడ్డవాడు. మానాభిమానాలు గల మానవుడు. ఆయన స్వతహాగా అనేక విషయాల్లో కలిగించుకోగా చాలా ఢక్కామొక్కీలు తిన్నవాడు గనక అనుభవజ్ఞుడు. న్యాయాన్యాయ విచక్షణా జ్ఞానం, పాపభీతి, ధర్మచింత కలవాడు. ఆయన ఎప్పుడూ దేనికోసమో మధనపడుతూ వుంటాడు. ఆయన చూపులు దేనికోసమో నిరీక్షిస్తున్నట్టుగా రాబోయే ఏ భయంకర సంఘటనకో ఎదురు చూస్తున్నట్టుగా వుంటాయి. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడడు. కుటుంబం పూర్వంకన్నా బాగా చితికిపోయినా, తిండికిమాత్రం లోపంలేదు గనుక ఇంట్లోనో, ఆలయంలోనో కూర్చుని రామా కృష్ణా అనుకుంటూ గడిపేవాడు. అతని చిత్రమైన దైవప్రార్థన విన్నవారినందర్నీ ఆశ్చర్యపరచేది. అతని ప్రార్థనలో చివరి వాక్యంగా— “దుష్టుల్ని వెంటనే శిక్షించు తండ్రీ, నిజం వెల్లడించు తండ్రీ”, అనేవాడు. ఇది ఎవరికీ అర్థమయ్యేదికాదు. గ్రామస్థుల దృష్టిలో ఆయన ఒక మహానుభావుడు. గ్రామంలో పెద్దవాళ్ళు అని చెప్పుకునే వాళ్ళల్లో మొదటివాడు. వయసు సుమారుగా అరవై ఏళ్ళుంటాయ్. ఒకానొకప్పుడు కనకేశ్వరరావుగారు, రాజుగారు బంధువులే కాకుండా ప్రాణస్నేహితులు. కాని, ఏ కారణంచేతనో విడిపోయారు. ఇందులో పరమార్థం ఎవరికీ తెలియదు.

రాజుగారికి ఒక్కగా నొక్క తల్లిలేని పిల్ల నిర్మల; మంచి సౌందర్యరాశి. ఆ గ్రామంలో నిర్మల్ని మించిన అందగత్తెలు లేరనే చెప్పాలి.

రావు బహద్దూర్ కనకేశ్వరరావుగారు—

కనకేశ్వరరావుగారి పెద్దదిక్కు, చిన్నదిక్కూ

32—వ పేజీ చూడండి

